సాక్షి
వైఎస్సార్ జిల్లా

సోమవారం ౹ 19 ౹ మే ౹ 2025



నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

ఏపీ ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ పరీక్ష (ఏపీఈఏపీసెట్) - 2025 నేటి నుంచి ప్రారంభం కానుంది. ఇందుకోసం ఏర్పాట్లు పూర్తయ్యాయి. -8లో



నోటీసులు ఇవ్వకుండా తొలగించడం అన్యాయం

వ్యాపారులకు నోటీసులు ఇవ్వకుండా షాపులు తొలగించడం అన్యాయమని మేయర్ సురేష్ బాబు అన్నారు. -8లో

గరిష్టం/కనిష్టం
34.6/25.1

వాతావరణం

జిల్లాలో ఆదివారం 25.1 - 34.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 4.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

గంగమ్మా.. చల్లంగా చూడమ్మా..

లక్కిరెడ్డిపల్లి: చల్లంగా చూడమ్మా..గంగమ్మా అంటూ అనంతపురం గంగమ్మను భక్తులు వేడుకున్నారు. ఆదివారం ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారికి భక్తులు బోనాలు సమర్పించారు.తలనీలాలు అర్పించారు. ఆలయ పూజారులు అమ్మవారిని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. విశేష పూజలు జరిపారు.పూజల అనంతరం భక్తులక తీర్థప్రసాదాలు అందజేశారు.కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి



నాయకులతో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత

పులివెందుల రూరల్: పులివెందుల నియోజక వర్గంలో తెలుగుదేశం పార్టీని బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పని చేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత తెలిపారు. పట్టణంలోని రింగ్ రోడ్డు సమీపం లో ఉన్న టీడీపీ కార్యాలయానికి ఆమె ఆదివారం విచ్చేశారు. కడపలో జరిగే మహానాడు ఏర్పాట్లు పరిశీలించేందుకు వెళ్తూ.. ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు, బీజేపీ నాయకులతో మాట్లాడారు. వారితో పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ నాయకులు జోగిరెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, శశిభూషణ్‌రెడ్డి, భానుప్రకాష్‌రెడ్డి, బాషా, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి సమరశీల పోరాటం




సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఈశ్వరయ్య

బద్వేల్ అర్బన్ : జిల్లా సమగ్రాభివృద్ధికి సమరశీల పోరాటం చేస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య పేర్కొన్నారు. స్థానిక ఎన్‌జీవో హోంలో నిర్వహించిన జిల్లా మహాసభల ఆహ్వాన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. బద్వేల్‌లో జరగబోవు సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. 2025 డిసెంబర్ 26 నాటికి సీపీఐ వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా శత జయంతి ఉత్సవం నిర్వహించుకోబోతోందని అన్నారు. ఈ సమావేశంలో వివిధ పార్టీలు, సంఘాల నాయకులు జి.చంద్ర, వీరశేఖర్, అబ్దుల్‌ఖాదర్, మస్తాన్, బాలు, రమణారెడ్డి, పెంచలయ్య, వెంకటశివ, నాగసుబ్బారెడ్డి, పి.చంద్రశేఖర్, టి.సుబ్బరాయుడు, జి.వలరాజు, ఎం.వి.సుబ్బారెడ్డి, జి.వేణుగోపాల్, కె.సి.బాదుల్లా, విజయలక్ష్మి, శ్రీరాములు, సుబ్రమణ్యం, పి.వి.రమణ, వెంకటరమణ, ఇమ్మానియేల్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీతో సరి.. చర్యలేవి మరి..

- ఆర్టీపీపీ ఫ్లైయాష్‌ను కొల్లగొట్టిన ఇంటి దొంగలు
- బూడిద బూచోళ్లు దొరికినా.. శిక్ష ఏదీ?
- కేవలం స్థానచలనంతో మమ
- శాఖాపరమైన చర్యలకు జెన్‌కో అధికారులు వెనకడుగు





సాక్షి ప్రతినిధి, కడప: ఉద్యోగులు ఆయా సంస్థల శ్రేయస్సు కోసం పాటుపడాలి. నిబద్ధతతో పని చేసే వారు.. ఎవరైనా అలానే వ్యవహరిస్తారు. ఉద్యోగం ముసుగులో అక్రమాలకు తెరలేపుతూ, తిన్నంటి వాసాలు లెక్కపెట్టే వారిని ఉపేక్షించడం సహించరాని నేరం. అయితే ఆర్టీపీపీలో ఇందుకు భిన్నంగా జరిగింది. కొందరు అధికారులు అవినీతి తిమింగలాలుగా మారి.. ఆ సంస్థలోని ఫ్లైయాష్ (బూడద)ను దోచేశారు. వారిని గుర్తించిన జెన్‌కో ఉన్నతాధికారులు.. బదిలీలతో సరిపెట్టి చేతులు దులుపుకొన్నారు. బూడిద బూచోళ్లపై శాఖాపరమైన చర్యలు తీసుకునేందుకు సాహసం చేయడం లేదు. విచారణతో సరిపెట్టి నివేదిక తొక్కి పెట్టారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అక్రమార్కులకు పెత్తందారుల అండ ఉండటంతో.. ఉన్నతాధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

బినామీ కంపెనీలు పెట్టి..

ఆర్టీపీపీలో ఫ్లైయాష్ విక్రయాల్లో అక్రమాలు పెద్ద ఎత్తున చోటు చేసుకున్నాయి. అక్కడ విధులు నిర్వర్తిస్తున్న ముగ్గురు అధికారులు.. బినామీ కంపెనీలు పెట్టి, వాటి ద్వారా ఫ్లైయాష్ కొల్లగొట్టారనే ఆరోపణలు వచ్చాయి. శ్రీగణేష్, మణికంఠ, ఆర్వీజీ, శ్రీకృష్ణ లాజిస్టిక్స్ పేరుతో.. ఆర్టీపీపీ అధికారులు వేమెంటుతో నిమిత్తం లేకుండా ఫ్లైయాష్ తరలించే వారు. దీనిపై ఆరోపణలు రావడంతో.. గతేడాది అక్టోబర్ 28న విజిలెన్స్ విచారణ మొదలై నవంబర్‌లో ముగిసింది. విచారణ అనంతరం ఇద్దరు అధికారులను ఒడిస్సా, ఒకరిని శ్రీశైలానికి బదిలీ చేశారు. అంతటితో జెన్‌కో అధికారులు చేతులు దులుపుకొన్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

విచారణ పూర్తయినా..

ఆర్టీపీపీలో ఫ్లైయాష్ కేటాయింపులు, బినామీ కంపెనీలతో కొల్లగొట్టిన వైనం.. విజిలెన్స్ విచారణలో నిగ్గు తేలింది. ఒక ఫ్లైయాష్ ట్యాంకర్‌పై రూ.20 వేల అక్రమ ఆదాయం పొందినట్లు తెలుస్తోంది. ఇలా రోజూ లక్షలాది రూపాయలు అక్రమార్కుల జేబుల్లోకి చేరింది. అనంతరం ఏప్రిల్ 10, 11వ తేదీల్లో శాఖాపరమైన విచారణను అధికారులు నిర్వహించారు. 40 రోజులు పూర్తి కావస్తున్నా.. ఎలాంటి చర్యలు చేపట్టలేదు. నివేదిక సీల్డ్ కవర్లు సజావుగా మేనేజింగ్ డైరెక్టర్‌కు చేరాయా? అధికారులను కాపాడేందుకు.. పెత్తందారులు ఇచ్చిన కవర్లు ఏమైనా అడ్డుకున్నాయా? అనే అనుమానాలు ఆర్టీపీపీ ఉద్యోగుల్లో లేకపోలేదు. చిన్నాచితక ట్రాన్స్‌పోర్టర్లను కడుపు కొట్టి.. బినామీల పేరుతో ట్రాన్స్‌పోర్టు నిర్వహించిన అధికారులపై చర్యలు బదిలీతోనే సరిపెట్టారా? శాఖాపరమైన చర్యలు తీసుకోరా? ఇలాగైతే ఆర్టీపీపీలో అక్రమార్కులను ఎలా నిలవరించగలరని విశ్లేషకులు నిలదీస్తున్నారు. అసలు విషయం జెన్‌కో ఎండీ వరకూ వెళ్లిందా, లేదా అని ఉద్యోగులు అనుమానాలు వ్యక్తం చేయడం వెనుక.. ఇప్పటికీ శాఖాపరమైన చర్యలు లేకపోవడమేనని పలువురు వివరిస్తున్నారు.

నడిరోడ్డుపై దారుణ హత్య

జమ్మలమడుగు రూరల్: జమ్మలమడుగు శివారులో ఆదివారం నడిరోడ్డుపై ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. సంఘటన స్థలానికి సమీపంలో ఉన్న ట్రాన్స్‌పోర్ట్ సిబ్బంది.. అతన్ని గుర్తించి ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. వివరాలు ఇలా ఉన్నాయి. నంద్యాల జిల్లా వెలుగోడు ప్రాంతానికి చెందిన చెన్నంశెట్టి మల్లికార్జున(32) ప్రొద్దుటూరు ప్రాంతంలో నివసిస్తున్నాడు. ఆయన భార్య సరోజ ప్రొద్దుటూరు మండలం కల్లూరులో పోస్ట్ ఉమెన్‌గా విధులు నిర్వహిస్తోంది. మల్లికార్జున తనకు ఉన్న వాహనాన్ని ఇటీవల కాలంలో.. జమ్మలమడుగుకు చెందిన ఓ ట్రాన్స్‌పోర్ట్ యాజమానికి విక్రయించినట్లు సమాచారం. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం జమ్మలమడుగు శివారులోని ముద్దనూరు రహదారిలో కొత్తరోడ్డు సమీపంలో ఉన్న ట్రాన్స్‌పోర్ట్ వద్దకు వచ్చినట్లు తెలుస్తోంది. ట్రాన్స్‌పోర్ట్ యాజమానితో చర్చించిన అనంతరం ఆయన వెళ్తుండగా.. కొందరు వ్యక్తులు పిడిబాకులు, కత్తులతో దాడి చేశారు. తీవ్ర గాయాలతో రక్తసిక్తమై పడి ఉన్న అతన్ని గుర్తించిన ట్రాన్స్‌పోర్ట్ సిబ్బంది హుటాహుటిన స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దుర్యాప్తు ప్రారంభించారు.



హత్యకు గురైన మల్లికార్జున

కుటుంబ మనస్పర్థలే కారణమా!

మల్లికార్జున, ఆయన భార్య సరోజ మధ్య మనస్పర్థల కారణంగా.. గత కొన్ని నెలలుగా వేర్వేరుగా ఉంటున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇదిలా ఉండగా హత్య చేసినట్లు అనుమానం ఉన్న కొందరిని పోలీసులు ఆదివారం రాత్రి అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. వీరిలో సరోజ తమ్ముడు వినోద్ కూడా ఉన్నట్లు తెలుస్తోంది. దీనిని బట్టి కుటుంబ మనస్పర్థలతోనే ఈ హత్య జరిగి ఉంటుందా! అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే ట్రాన్స్‌పోర్ట్ యాజమాని.. మల్లికార్జునను ఎందుకు పిలిపించాడు అనే విషయంపై కూడా పోలీస్‌లు కూపీ లాగుతున్నారు. ఏదిఏమైనా ఆర్థిక లావాదేవీలు, లేదా కుటుంబ సమస్యల వల్లనే హత్య జరిగినట్లు తెలుస్తోంది. పోలీసుల విచారణ అనంతరం పూర్తి విషయాలు బయటకు వచ్చే అవకాశం ఉంది.

'కాల్ సెంటర్' సేవలు వినియోగించుకోవాలి

డీఆర్వో విశ్వేశ్వరనాయుడు

కడప సెవెన్‌రోడ్స్: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించిన మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని డీఆర్వో విశ్వేశ్వరనాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు పరిష్కారం కాకపోయినా లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చని ఆయన పేర్కొన్నారు.

నేడు పీజీఆర్ఎస్ నిర్వహణ: ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)ను సోమవారం కలెక్టరేట్ సభాభవన్‌లో నిర్వహిస్తున్నట్లు డీఆర్వో తెలిపారు. అర్జీదారులు మీకోసం.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు. 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతోపాటు మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామన్నారు.

డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం: డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం సోమవారం ఉదయం 9.30 నుంచి 10 గంటల వరకు జరుగుతుందన్నారు. ప్రజలు 08562-244437 ల్యాండ్‌లైన్ నంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను విన్నవించుకోవచ్చునన్నారు.

'స్టార్టప్ కడప సెంటర్'కు శ్రీకారం

- నేడు శంకుస్థాపన
- కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప ఎడ్యుకేషన్: పారిశ్రామిక ప్రగతికి, యువతలో ఆవిష్కరణకు, ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి దోహదపడేలా అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందించిన 'స్టార్టప్ కడప ఎంట్రప్రెన్యూర్‌షిప్ సెంటర్' నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నట్లు జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ తెలిపారు. ఈ కేంద్రానికి కడప ఆర్ట్స్ కాలేజీ సమీపంలో సోమవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత శంకుస్థాపన చేయనున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ కేంద్రం యువ స్టార్టప్ వ్యవస్థాపకులు, ఫ్రీలాన్సర్లు, చిన్న, మధ్యతరహా వ్యాపార సంస్థల అభివృద్ధికి పునాది వేస్తూ, కడపను వ్యాపార అవకాశాల కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా కీలక పాత్ర పోషించనుందన్నారు. దేశ, విదేశాల్లో స్థిరపడిన కడప జిల్లా వాసుల సహకారంతో, వారిని అనుసంధానం చేసుకుని ఈ స్టార్ట్ అప్ హబ్‌ను ముందుకు తీసుకువెళ్తామన్నారు.

ప్రాజెక్ట్ లక్ష్యాలు: స్టార్టప్ కడప కేంద్రం ఆవిష్కరణను ప్రోత్సహించడమే కాక, ఆలోచనల నుంచి అభివృద్ధి చెందిన వ్యాపారాల వరకు అన్ని దశల్లో స్టార్టప్‌లకు మద్దతు అందించేందుకు రూపొందించారు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, వృత్తిపరమైన వర్క్‌స్పేస్‌లు, సహకార వాతావరణం వంటి అంశాలతో యువతకు అవసరమైన అన్ని వనరులు ఈ కేంద్రం అందించనుంది.



నిర్మాణ వివరాలు

ఎ+3 అంతస్తులు, 25,000 చదరపు అడుగుల విస్తీర్ణం పీఈబీ టెక్నాలజీ ఆధారంగా నిర్మాణం.

ప్రాజెక్ట్ మొత్తం వ్యయం: ఈ ప్రాజెక్టును రూ.10 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తారు. షిర్డీసాయి ఎలక్ట్రికల్స్ సంస్థ రూ.4 కోట్ల విరాళం అందించింది.

'పది' సప్లిమెంటరీకి వేళాయె

- నేటి నుంచి 28 వరకు పరీక్షలు
- జిల్లా వ్యాప్తంగా 28 కేంద్రాలు
- పకడ్బందీగా ఏర్పాట్లు

కడప ఎడ్యుకేషన్: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు సమయం ఆసన్నమైంది. సోమవారం నుంచి ఈ నెల 28 వరకు జరగనున్నాయి. ఇటీవల విడుదలైన ఫలితాల్లో ఉత్తీర్ణులు కాని వారి కోసం.. ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. రెగ్యులర్ పదో సప్లిమెంటరీని 5667 మంది విద్యార్థులు.. ఓపెన్ పది, ఇంటర్ పరీక్షలను 1484 మంది రాయనున్నారు.

ప్రత్యేక తరగతులు

గతేడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా పదో తరగతి పరీక్షలు తప్పిన విద్యార్థులకు ఆయా పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించారు. ఆయా సబ్జెక్టులకు చెందిన ఉపాధ్యాయులు రోజూ క్లాసులు తీసుకుని విద్యార్థులను తీర్చిదిద్దారు. జిల్లా వ్యాప్తంగా 5767 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వీరి కోసం 28 పరీక్షా కేంద్రాలు సిద్ధం చేశారు. ఉదయం 9.30 గంటల నుంచి 12.45 వరకు పరీక్షలు నిర్వహించనున్నారు.



పదో తరగతి పరీక్ష రాస్తున్న విద్యార్థులు (ఫైల్)

ఓపెన్ పది, ఇంటర్ విద్యార్థుల కోసం..

ఓపెన్ పది, ఇంటర్ పరీక్షలను జిల్లా వ్యాప్తంగా 1484 మంది రాయనున్నారు. వీరి కోసం 13 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ నెల 19 నుంచి 24 వరకు ఉదయం 9.30 నుంచి 12.30 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు.

అధికారుల నియామకం:

పది సప్లిమెంటరీ పరీక్షల పర్యవేక్షణకు అధికారుల నియామకం పూర్తయింది. 28 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 28 మంది డిపార్ట్‌మెంట్ అధికారులతోపాటు నలుగురు స్క్వాడ్ సభ్యులను నియమించారు. అలాగే ఓపెన్ పది, ఇంటర్ పరీక్షలకు 13 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 13 డిపార్ట్‌మెంట్ అధికారులతోపాటు స్క్వాడ్ సభ్యులను సిద్ధం చేశారు.

ఏర్పాట్లు పూర్తి



జిల్లా వ్యాప్తంగా ప్రారంభం అవుతున్న పది సప్లిమెంటరీ పరీక్షలతో పాటు ఓపెన్ పది, ఇంటర్ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశాం. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాం. అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాం.

– షేక్ షంషుద్దీన్, జిల్లా విద్యాశాఖ అధికారి

వర్సిటీ.. ఈ దుస్థితి ఏమిటీ!

- ఎట్టకేలకు నేడు బ్రౌన్ లైబ్రరీకి శంకుస్థాపన
- పాపం యూనివర్సిటీ అధికారులు
- నాడు గౌరవం.. నేడు అవమానాలు, చీదరింపులు
- ప్రొటోకాల్ వివాదం నుంచి గట్టెక్కిన వైవీయూ
- ఒక సమావేశానికి ఇద్దరు అధ్యక్షులట!

సాక్షి ప్రతినిధి, కడప: యోగివేమన యూనివర్సిటీ వైస్ చాన్సలర్‌లకు మొన్నటి వరకూ గౌరవ, మర్యాదలకు కొదవ లేదు. అభివృద్ధి పని ఏదైనా సరే యూనివర్సిటీ విభాగం కోరితే.. తక్కున ఆదేశాలు లభించేవి. మధ్యలో వాహనాలు వెళితే విద్యార్థుల చదువులకు ఆటంకం అంటే యూనివర్సిటీకి బైపాస్ రోడ్డు వచ్చేసింది. నాటి రాజసం, గౌరవ మర్యాదలు నేడు కోల్పోయారు. చేసిన శంకుస్థాపన మరోమారు చేయడమే విడ్డూరమైతే.. అందులోనూ అధికార పార్టీ నేతలు ప్రొటోకాల్ వివాదానికి తెరలేపారు. యూనివర్సిటీ అధికారులపై చిందులేశారు. ఒక సమావేశానికి 'సభాధ్యక్షులు, సమావేశపు అధ్యక్షులు'గా ఇద్దరిని పెట్టుకొని కార్యక్రమ నిర్వహణకు సన్నాహాలు చేశారు. ఎట్టకేలకు బ్రౌన్ లైబ్రరీ నూతన భవనానికి సోమవారం శంకుస్థాపన చేపట్టనున్నారు.



తాజా శిలాఫలకం

గత నెల 29న జరగాల్సి ఉండగా..

సీపీ బ్రౌన్ లైబ్రరీకి గత నెల 29న ఇన్‌చార్జి మంత్రి ఎస్.సవిత చేతుల మీదుగా శంకుస్థాపన చేయాల్సి ఉంది. కాగా శిలాఫలకంలో తన పేరు పెద్ద అక్షరాలతో లేదని కడప ఎమ్మెల్యే వివాదం చేశారు. తనకు మాత్రమే ప్రాధాన్యత ఉండాలని పెద్ద ఎత్తున రగడ చేయడంతో.. తొలుత తయారు చేసిన శిలాఫలకం స్థానంలో మరో శిలాఫలకం తయారు చేయించారు. ఈ విషయంపై సాక్షి కథనం ప్రచురించిన సంగతి తెలిసిందే. అప్పట్లో శంకుస్థాపన కార్యక్రమం ఆగిపోయింది. తాజాగా సోమవారం శంకుస్థాపన చేస్తున్న శిలాఫలకంలో సభాధ్యక్షులు ఎమ్మెల్యే మాధవిరెడ్డి, సమావేశపు అధ్యక్షులుగా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య అల్లం శ్రీనివాసరావు పేర్లు పెట్టాల్సిన పరిస్థితి ఉత్పన్నమైంది.

శిలాఫలకం పేర్ల వద్ద రగడ

యోగివేమన యూనివర్సిటీ పరిధిలోని బ్రౌన్ గ్రంథాలయం శంకుస్థాపనలో రగడ మొదలైంది. జిల్లా కేంద్రంలోని సీపీ బ్రౌన్ గంథాలయ నిర్మాణానికి ఇది వరకే సీఎం హోదాలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అప్పట్లో ప్రొటోకాల్ నిబంధనల ప్రకారం అందరి పేర్లు శిలాఫలకంలో పొందుపర్చారు. మళ్లీ శంకుస్థాపన చేసేందుకు సిద్ధమైన కూటమి సర్కారు.. ఇన్‌చార్జి మంత్రి సవిత ద్వారా చేపట్టేందుకు నిర్ణయించారు. ప్రొటోకాల్ నిబంధనల ప్రకారం శిలాఫకలంలో పేర్లు పెట్టగా, కమలాపురం, జమ్మలమడుగు ఎమ్మెల్యేలు పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, ఆదినారాయణరెడ్డి పేర్లు ప్రధానంగా కన్పించడంపై అభ్యంతరం చెప్పడం, యూనివర్సిటీ అధికారులకు ప్రాధాన్యత లేకుండా చేయడంతో వివాదం తారాస్థాయికి చేరింది. ఒక దశలో యూనివర్సిటీ ఉన్నత స్థాయి అధికారి క్షమాపణ చెబితేనే.. శంకుస్థాపన అనే స్థాయికి వ్యవహారం చేరినట్లు ఆరోపణలు వచ్చాయి. ఎట్టకేలకు కొత్తగా సోమవారం శంకుస్థాపన చేపట్టి సంబరాలు చేసుకునేందుకు కూటమి సర్కారు నేతలు సిద్ధమవడం గమనార్హం.

సీపీ బ్రౌన్ లైబ్రరీలో మన చరిత్రకు సజీవ సాక్ష్యాలైన తాళపత్ర గ్రంథాల నుంచి ఎన్నో విలువైన పుస్తకాలు ఉన్నాయి. ఇక్కడ తెలుగు భాషా పరిశోధన కేంద్రం కూడా ఆనాడు వైఎస్ రాజశేఖరరెడ్డి ఏర్పాటు చేశారు. కాగా కార్యకలాపాలకు ప్రస్తుతం ఉన్న భవనం సరిపోవడం లేదని గతంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తే.. స్పందించి జీఓ నంబర్ 94/హెచ్ఈ/యూఈ-డీఈపీటీ ద్వారా 2021 జూలై 7న రూ.5.5 కోట్ల నిధులు విడుదల చేశారు. ఆ వెంటనే 2021 జూలై 9న నూతన భవనానికి శంకుస్థాపన కూడా చేశారు. ప్రైవేటు భూమి కొనుగోలు చేసేందుకు,

వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.6.87 కోట్ల మంజూరు



నిర్మాణ ధరలు పెరిగాయని తిరిగి అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తే.. జీఓ నంబర్ 92/హెచ్ఈ/యూఈ- డీఈపీటీ ద్వారా 2023 నవంబర్ 7న రూ.6.874 కోట్ల నిధులు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పనులను ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రా డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా చేపట్టేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. భూమి కొనుగోలు చేసేందుకు రూ.3.11 కోట్లు, నిర్మాణ పనులు చేపట్టేందుకు రూ.3.76 కోట్ల నిధులు డిపాజిట్ చేశారు. టెండర్లు కూడా పూర్తి అయ్యాయి. పనులు చేపట్టడంలో జాప్యం చేయడం, ఈలోపు ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో.. ప్రారంభం కాకుండా నిలిచిపోయాయి. కాగా వైఎస్ జగన్ సర్కార్ ఏపీఈడబ్ల్యూఐడీసీ సంస్థకు గ్రాంటు డిపాజిట్టు చేసిన ఆ పనులు మొదలు పెట్టేందుకు కూటమి సర్కార్ ప్రజాప్రతినిధులు ఆటంకం కల్గించారు. కూటమి ప్రభుత్వమే చేసినట్లుగా శంకుస్థాపన చేయాలనే పట్టుదలకు పోయారు.



సీఎం హోదాలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన శంకుస్థాపన (ఫైల్)

నేటి నుంచి ప్యాసింజర్ రైళ్ల పునఃప్రారంభం

కలికిరి: గుంతకల్ రైల్వే డివిజన్ పరిధిలోని ధర్మవరం రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనుల్లో భాగంగా గత నెల 15 నుంచి ఈ నెల 18వ తేదీ వరకు రద్దయిన ప్యాసింజర్ రైళ్లు, దారి మళ్లింపు ఎక్స్‌ప్రెస్, సూపర్ ఫాస్ట్ రైళ్లు సోమవారం నుంచి తిరిగి యథావిధిగా నడవనున్నాయి. తిరుపతి నుంచి మదనపల్లి రోడ్, ధర్మవరం మీదుగా గుంతకల్ వరకు, గుంతకల్ నుంచి తిరుపతికి నడిచే ప్యాసింజర్ రైళ్లు గత నెల 15 నుంచి రద్దయ్యాయి. వాటితోపాటు పాటు మరికొన్ని రైళ్లు పునఃప్రారంభించనున్నారు.

క్లుప్తంగా

గుర్తు తెలియని వృద్ధురాలి మృతి



మృతి చెందిన గుర్తు తెలియని వృద్ధురాలు

చాపాడు : మండల పరిధిలోని అల్లాడుపల్లె వీరభద్రస్వామి దేవస్థానం వద్ద గల సత్రంలో ఆదివారం ఉదయం గుర్తు తెలియని వృద్ధురాలు మృతి చెందింది. మైదుకూరు వైపు వెళ్లే దారిలో గల సత్రంలో వృద్ధురాలు మృతి చెంది ఉండటాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. ఆమె గురించిన వివరాలు తెలియకపోవడంతో పంచాయతీ అధికారులకు అప్పగించి అంత్యక్రియలు నిర్వహించినట్లు స్థానికులు తెలిపారు. నాలుగు రోజుల నుంచి ఈమె ఇక్కడ ఉందని కొందరు వ్యక్తులు వదిలేసి వెళ్లారని స్థానికులు చర్చించుకుంటున్నారు.

ఎస్పీ, డీఎస్పీని కలిసిన వార్డు మెంబర్లు

ప్రొద్దుటూరు : హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయాలని కోరుతూ గోపవరం గ్రామ పంచాయతీకి చెందిన 13 మంది వైఎస్సార్‌సీపీ వార్డు సభ్యులు ఆదివారం జిల్లా ఎస్పీ, ప్రొద్దుటూరు డీఎస్పీని కలిశారు. ఈ మేరకు కోర్టు ఉత్తర్వుల ప్రతులను ఆయా కార్యాలయాల్లో అందజేశారు. గోపవరం గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ ఎన్నిక సోమవారం ఉదయం జరగనుంది. గతంలో అరాచకాలకు, విధ్వంసాలకు పాల్పడిన టీడీపీ నేతల కారణంగా ఉప సర్పంచ్ ఎన్నిక వాయిదా పడింది. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ వార్డు సభ్యులు హైకోర్టును ఆశ్రయించారు. తమకు రక్షణ కల్పించి ఉప సర్పంచ్ ఎన్నికను ప్రశాంతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా జరిపేందుకు ప్రత్యేకంగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, ఎన్నిక ప్రక్రియను సీసీ కెమెరాల ద్వారా రికార్డు చేయాలని హైకోర్టును కోరారు. సర్పంచ్ గద్దా మోషాతో పాటు ఉప సర్పంచ్ అభ్యర్థి బీరం రాఘవేంద్రా రెడ్డి, వైఎస్సార్‌సీపీ వార్డు సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

మదనపల్లె సిటీ : రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడిన సంఘటన ఆదివారం కురబలకోట మండలం చేనేతనగర్ వద్ద జరిగింది. తెట్టు గ్రామానికి చెందిన అఖిల్(21), విష్ణు(20) ద్విచక్ర వాహనంలో మదనపల్లె వైపు వస్తుండగా మదనపల్లె నుంచి ఆర్‌సి కురపల్లికి చెందిన రామమూర్తి(65) మరో ద్విచక్ర వాహనంలో వెళుతుండగా వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రెండు వాహనాల్లోని వారు గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం స్థానికులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. అలాగే అంగళ్లు విశ్వం కాలేజీ వద్ద గొళ్లపల్లె పంచాయతీ చీకిచెట్టిపల్లెకు చెందిన మౌలా కుమారుడు రోషన్‌జమీర్(19) ద్విచక్రవాహనంలో వెళుతుండగా ఎదురుగా వచ్చిన టాటా ఏస్ వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన రోషన్ జమీర్‌ను స్థానికులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనలపై ఆయా పోలీసు స్టేషన్ల పరిధిలో కేసులు నమోదు చేశారు.

నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

- నేటి నుంచి ఏపీ ఈఏపీ సెట్
- ఏర్పాట్లను సిద్ధం చేసిన అధికారులు
- జిల్లాలో 8 కేంద్రాల్లో ఆన్‌లైన్ పరీక్ష నిర్వహణ
- 19, 20న అగ్రికల్చర్, ఫార్మసీ ప్రవేశ పరీక్షలు
- 21 నుంచి 27 వరకు ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షలు
- జిల్లా వ్యాప్తంగా 16,473 మంది అభ్యర్థులు



పరీక్ష కోసం సిద్ధం చేసిన కంప్యూటర్ ల్యాబ్

కడప ఎడ్యుకేషన్ : ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి ఏపీ ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ పరీక్ష(ఏపీ ఈఏపీసెట్)– 2025 నేటి నుంచి జిల్లా వ్యాప్తంగా ప్రారంభం కానుంది. ఈ పరీక్షలను కంప్యూటర్ ఆధారిత(ఆన్‌లైన్) విధానంలో నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు సిద్ధం చేశారు. ఇందులో భాగంగా 19, 20 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ(బైపీసీ) కోర్సుల ప్రవేశ పరీక్షలు జరగనుండగా, ఈ నెల 21వ తేదీ నుంచి 27వ తేదీ వరకు ఇంజినీరింగ్ కోర్సుల ప్రవేశ పరీక్షలు జరగనున్నాయి. ఇందులో ప్రతి రోజు ఉదయం, సాయంత్రం రెండు సెషన్స్‌లో పరీక్షలు జరగనున్నాయి. ఇందుకు సంబంధించి వైఎస్సార్ జిల్లాలో 8 పరీక్షా కేంద్రాలను సిద్ధం చేశారు. ఇందులో 13049 మంది ఇంజినీరింగ్‌కు, 3389 మంది మంది అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షను రాయనుండగా మరో 35 మంది రెండు కలిపి పరీక్షలను రాయనున్నారు. ఇందులో ఉదయం సెషన్ 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంట వరకు, అలాగే మధ్యాహ్న సెషన్ 2.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నారు.

జిల్లాలో పరీక్షా కేంద్ర వివరాలు ఇలా..

ఏపీ ఈఏపీ సెట్ పరీక్ష కోసం జిల్లాలో 8 పరీక్షా కేంద్రాలను సిద్ధం చేశారు. ఇందులో కడపలో ఐదు పరీక్షా కేంద్రాలను, ప్రొద్దుటూరులో మూడు పరీక్షా కేంద్రాలు ఉన్నాయి. కడపకు సంబంధించి కేఎస్ఆర్ఎం, కేఎల్ఎం, కేఓఆర్ఎం, అన్నమాచార్య, శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాలలు, ప్రొద్దుటూరుకు సంబంధించి చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సు అండ్ టెక్నాలజీ, సాయి రాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, వాగ్దేవి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాలను సిద్ధం చేశారు. జిల్లాలో 8 పరీక్షా కేంద్రాలకు ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి 13049, అగ్రికల్చర్, ఫార్మసీకి సంబంధించి 3389 మంది రెండు విభాగాలకు సంబంధించి 35 మంది అభ్యర్థులు పరీక్షలను రాయనున్నారు.

రెండు సెషన్స్‌లో పరీక్ష..

ఉదయం సెషన్‌కు సంబంధించి 7.30 గంటల నుంచే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారు. మధ్యాహ్నం పరీక్షకు 12.30 గంటల నుంచి 2 గంటల వరకు పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారు. ఉదయం 9 గంటలు, మధ్యాహ్నం 2 గంటల తరువాత నిమిషం ఆలస్యమైనా ఎట్టి పరిస్థితుల్లోనూ పరీక్షా కేంద్రంలోకి అనుమతించరు. పరీక్ష జరిగే రోజు కనీసం గంట ముందుగా కేంద్రానికి చేరుకోవాలి. కేంద్రాల దగ్గర తనిఖీలతోపాటు బయోమెట్రిక్ హాజరు నమోదు, సంతకం చేయాల్సి ఉన్నందున చివరి నిమిషంలో హడావుడి పడకుండా చూసుకోవాలి.

విద్యార్థులు వెంట తీసుకురావాల్సిన వస్తువులు..

- విద్యార్థులు ఆన్‌లైన్‌లో దాఖలు చేసిన ఏపీ ఈఏపీ సెట్ –2025 దరఖాస్తు ప్రింటవుట్ కాపీతో పాందుపర్చిన నిర్ణీత బాక్స్‌లో విద్యార్థి కలర్ పాస్ పోర్టు సైజ్ ఫొటోను అతికించి సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్‌తో సంతకం చేయించుకోవాలి.
- పరీక్ష జరిగే జరిగే రోజున సదరు ప్రింటవుట్ కాపీతోపాటు హాల్ టికెట్ వెంట తీసుకుని వెళ్లాలి. బ్లూ, బ్లాక్ కలర్ బాల్ పాయింట్ పెన్ను అనుమతిస్తారు. గుర్తింపు కోసం ఇంటర్ హాల్ టికెట్, పాస్‌పోర్టు, పాన్‌కార్డు, ఆధార్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, ఓటర్ ఐడీలలో ఏదో ఒకటి ఒరిజినల్ తీసుకుని వెళ్లాలి. ఇవి మినహా ఇతర ఏ వస్తువులు అనుమతించరు.
- విద్యార్థి ఫొటో అతికించిన ఆన్‌లైన్ దరఖాస్తు కాపీపై పరీక్షా కేంద్రంలో ఇన్విజిలేటర్ సమక్షంలో సంతకం చేసి ఎడమ చేతి బొటనవేలి ముద్ర వేయాలి.

విద్యుత్ షాక్‌తో రెండు బర్రెలు మృతి



విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన బర్రెలు

చాపాడు : మండల కేంద్రమైన చాపాడులో ఆదివారం ఉదయం విద్యుత్ షాక్‌తో రెండు బర్రెలు మృతి చెందాయి. మైదుకూరు – ప్రొద్దుటూరు జాతీయ రహదారిలోని ఏపీజీబీ బ్యాంకుకు ఎదురుగా శనివారం రాత్రి ఏర్పడిన గాలి, వాన బీభత్సానికి విద్యుత్ తీగలు తెగి పడ్డాయి. ఆదివారం ఉదయం 7 గంటల ప్రాంతంలో దళితవాడకు చెందిన శ్రీనివాసులు, నాగులమ్మకు చెందిన బర్రెలు పొలంలో మేత మేస్తుండగా రోడ్డు వైపు వచ్చాయి. అప్పటికే తెగిపడి ఉన్న విద్యుత్ తీగలు తగలడంతో విద్యుత్ షాక్‌కు గురైన బర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. రెండు బర్రెల విలువ రూ.30వేలు పైగా ఉంటుందని, ప్రభుత్వమే తమను ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

అట్లూరులో..

అట్లూరు : మండల పరిధిలోని కుమ్మరవారిపల్లి గ్రామానికి చెందిన అంబవరం అనసూయమ్మ గేదె విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. స్థానికుల వివరాల మేరకు అనసూయమ్మకు చెందిన పాడి గేదె రోజు మాదిరిగానే పచ్చిక మేసేందుకు పొలాలకు వెళ్లింది. సాయంత్రం వరకూ ఇంటికి రాక పోవడంతో పొలాల్లోకి వెళ్లి వెతకగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర న్యూట్రల్ వైరుకు విద్యుత్ సరఫరా అయి మృతి చెంది ఉంది. ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యంతో గేదె మృత్యువాత పడిందని రూ.70 వేలు విలువ చేసే గేదె మృతికి కారకులైన ట్రాన్స్‌కో అధికారులు నష్ట పరిహారం చెల్లించాలని బాధితురాలు కోరారు.

ఎస్సీ వర్గీకరణ రోస్టర్ పాయింట్ల లోపాలను సరిదిద్దాలి



సమావేశంలో మాట్లాడుతున్న పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ

కడప రూరల్ : ఎస్సీ వర్గీకరణ అంశానికి సంబంధించి రోస్టర్ పాయింట్ల లోపాలను సరిదిద్దాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ కోరారు. ఆదివారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో మాదిగ సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీలో చట్టం చేసేలోపు ఎస్సీ వర్గీకరణకు సంబంధించిన రోస్టర్ పాయింట్ల లోపాలను సరిదిద్ది మాల, మాదిగ వర్గాలకు న్యాయం చేయాలన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వర్గీకరణ అంశానికి సంబంధించి సమన్యాయం చేస్తున్నారని తెలిపారు. అలాగే ఎస్సీ సబ్ ప్లాన్ నిధులలో ఏబీసీడీ వర్గీకరణ చేయాలన్నారు. కార్యక్రమంలో దళిత సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కొత్తపల్లి ఎల్లయ్య, ఏపీ ఎమ్మార్పీఎస్ తెలుగు రాష్ట్రాల కార్యదర్శి గొడుగునూరు మునెయ్య, తప్పెట హరిబాబు, మాతంగి సుబ్బరాయుడు, తప్పెట శివ, వెంకటసుబ్బయ్య, కొన్నెపల్లె మునెయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు గోపవరం ఉపసర్పంచ్ ఎన్నిక

- గతంలో రెండు సార్లు వాయిదా పడిన ఎన్నిక
- నేటి ఎన్నికకు భారీ పోలీసు బందోబస్తు

ప్రొద్దుటూరు క్రైం : గోపవరం గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ ఎన్నిక సోమవారం నిర్వహించనున్నారు. ఎన్నిక సందర్భంగా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. మార్చి నెలలో రెండు సార్లు ఎన్నికను నిర్వహించడానికి జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేయగా వివిధ కారణాలతో ఈ ఎన్నిక వాయిదా పడిన విషయం తెలిసిందే. మార్చి 27న నిర్వహించిన ఉపసర్పంచ్ ఎన్నిక సందర్భంగా ఓటు వేసేందుకు వస్తున్న వైఎస్సార్‌సీపీ వార్డు మెంబర్లను అధికార కూటమి పార్టీకి చెందిన కొందరు రాళ్లతో దాడి చేశారు. వాహనాల అద్దాలను ధ్వంసం చేసి భయభ్రాంతులకు గురి చేశారు. వారు విసిరిన రాళ్ల దాడిలో పలువురు వైఎస్సార్‌సీపీ వార్డు మెంబర్లకు గాయాలయ్యాయి. వారిని అడ్డుకోవడంతో 12 మంది వార్డు సభ్యులు పోలింగ్ కేంద్రానికి వెళ్లలేక పోయారు. ఈ క్రమంలో కోరం లేకపోవడంతో ఎన్నికల అధికారి 28వ తేదీకి ఎన్నికను వాయిదా వేశారు.

గుండెపోటు నాటకంతో ఎన్నిక వాయిదా..

రెండో రోజు కూడా సేమ్ సీన్ రిపీట్ అయింది. అధికార పార్టీ నేతల వ్యూహ రచనలో భాగంగా రెండోసారి ఉప సర్పంచ్ ఎన్నిక వాయిదా పడింది. 28న ఉప ఎన్నిక సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మూడంచెల భద్రతను ఏర్పాటు చేసి కొత్రపాడు రోడ్డును పూర్తిగా మూసేశారు. భగత్‌సింగ్‌కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీల్లోని దుకాణాలను మూశారు. పోలింగ్ ప్రారంభమైన కొద్దిసేపటికే వైఎస్సార్‌సీపీ వార్డు మెంబర్లు ఓటు వేయడానికి పోలింగ్ కేంద్రానికి వెళ్లారు. ఎన్నికను వాయిదా వేయాలనే దురుద్దేశంతో అధికార పార్టీ నేతలు పోలింగ్ స్టేషన్‌లోకి వెళ్లి వారికి వారే గొడవకు దిగారు. అక్కడి మినిట్స్ బుక్‌ను చించేశారు. పూర్తి స్థాయిలో కోరం ఉన్నా సదరు ఎన్నికల అధికారి ఎన్నిక నిర్వహించలేదు. కొద్ది సేపటి తర్వాత గుండె నొప్పిగా ఉందని ఎన్నికల అధికారి రామాంజనేయరెడ్డి చెప్పడంతో ఉప సర్పంచ్ ఎన్నికను వాయిదా వేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు.

నేడు మూడో సారి ఉప సర్పంచ్ ఎన్నిక

సోమవారం గోపవరం ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. గతంలో జరిగిన దౌర్జన్యాలు, హింసాత్మక ఘటనలను దృష్టిలో ఉంచుకొని డీఎస్పీ భావన ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. ప్రొద్దుటూరు సబ్ డివిజన్‌లోని పోలీసులే గాక కడప నుంచి ప్రత్యేక బలగాలను రప్పిస్తున్నారు.

పోలింగ్ కేంద్రం పరిసరాల్లో 144 సెక్షన్

ఉపసర్పంచ్ ఎన్నిక సందర్భంగా పోలింగ్ కేంద్రం పరిసరాల్లో 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు ప్రొద్దుటూరు డీఎస్పీ భావన తెలిపారు. గోపవరం గ్రామ సచివాలయానికి (పోలింగ్ కేంద్రం) 100 మీటర్ల వరకు నిషేధాజ్ఞలు అమల్లో ఉంటాయని చెప్పారు. ఈ ప్రాంతంలో ప్రజలు ఎవ్వరూ గుంపులు గుంపులుగా గుమి కూడరాదని తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి ఎన్నిక ప్రక్రియ పూర్తయ్యే వరకు వ్యాపారస్తులందరూ దుకాణాలను మూయాలన్నారు. పోలీసుల ఆదేశాలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ తెలిపారు. ఎన్నిక ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు, వ్యాపారులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని పోలీసులు కోరారు.

నకిలీ బంగారంతో మోసం

రాజంపేట : రాజంపేట ఆర్టీసీ బస్టాండు వద్ద కూరగాయల వ్యాపారం చేసుకొని జీవిస్తున్న అన్నపూర్ణమ్మకు గుర్తుతెలియని వ్యక్తులు నకిలీ బంగారు ఇచ్చి ఆమె వద్ద రూ.5లక్షలు తీసుకెళ్లి మోసం చేసినట్లుగా అర్బన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు అందింది. ఈ విషయాన్ని ఆదివారం సీఐ రాజా తెలిపారు. వివరాల్లోకి వెళితే.. 2024 డిసెంబర్‌లో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు(ఇందులో ఒకరు మహిళ) అన్నపూర్ణమ్మ వద్దకు వచ్చి తమ వద్ద రూ.5లక్షల విలువ చేసే బంగారు ఉందని చెప్పి, బంగారు పరీక్షించుకున్నారు. గుర్తుతెలియని వ్యక్తుల వద్ద బంగారు తీసుకుంటే లేనిపోని సమస్యలు వస్తాయని అన్నపూర్ణమ్మ వెనకడుగు వేశారు. అయితే వారు ఇప్పుడు తీసుకోకపోయినా పర్వాలేదు, మా ఫోన్‌నెంబరు ఇస్తాము ఆ తర్వాత అయినా ఫోన్ చేస్తే వచ్చి ఇస్తామని వివరించారు. కొన్ని రోజుల తర్వాత మళ్లీ వచ్చి డబ్బు అవసరముందని, బంగారు తీసుకోవాలని మాయమాటలు చెప్పి నమ్మించారు. దీంతో అన్నపూర్ణమ్మ దంపతులు రూ.5లక్షలు నగదు ఇచ్చి, మోసగాళ్ల నుంచి బంగారు తీసుకున్నారు. ఆ తర్వాత వారు నగలను పరీక్షించుకోలేదు. సంక్రాంతి పండుగ సందర్భంగా నగలను పరిశీలిస్తే అవి నకిలీవని తేలింది. బయటికి చెబితే పరువు పోతుందనే భావనతో ఉండిపోయారు. ఎట్టకేలకు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ట్రాక్టర్ డ్రైవర్ మృతి

రాజంపేట : మన్నూరు సర్కిల్ పరిధిలోని ఊటుకూరు చెరువు సమీపంలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ డ్రైవర్ ధన్నాసి జనార్దన్ మృతి చెందాడు. శనివారం రాత్రి పోలీసులు ఈ ప్రమాదంపై కేసు నమోదు చేశారు. ఊటుకూరు చెరువు నుంచి జాగువారిపల్లెకు ట్రాక్టర్‌లో మట్టి తరలిస్తుండగా, అదుపుతప్పి కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు.

21న డీఈఓ కార్యాలయం ముట్టడి



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా

మైదుకూరు : తొమ్మిది రకాల పాఠశాలల విధానాన్ని వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ ఈనెల 21వ తేదీన అన్ని జిల్లాల్లో డీఈఓ కార్యాలయాలను ముట్టడిస్తున్నట్లు ఐక్య ఉపాధ్యాయ సంఘం (యూటీఎఫ్) రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా తెలిపారు. మైదుకూరులో ఆదివారం యూటీఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 9 రకాల బడుల విధానం తీసుకొచ్చి పాఠశాలలను నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతోందని ఆరోపించారు. వేలాది పాఠశాలల మూసివేత, వేలాది ఉపాధ్యాయుల మిగులు దిశగా ఆ విధానం ఉందన్నారు. దానిని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. మోడల్, ప్రైమరీ పాఠశాలల పేరుతో 2 కిలోమీటర్ల నుండి 7 కిలోమీటర్ల వరకు పాఠశాలలను కలపడం వల్ల చిన్న పిల్లలు ముఖ్యంగా బాలికలు బడికి దూరమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాల విద్యను కార్పొరేటీకరణ చేయడంలో భాగంగానే 19, 20, 21 జీఓలను విడుదల చేసిందని విమర్శించారు. ఇంగ్లీషు మీడియానికి తెలుగు మీడియంను సమాంతరంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు, జిల్లా సహాధ్యక్షుడు వై.రవికుమార్, జిల్లా కార్యదర్శి అజాజ్ అహ్మద్, సంఘం మండల నాయకులు ఎస్.గంగులయ్య, ఎం.గురివిరెడ్డి, టి.వెంకటరమణారెడ్డి, శ్రీనివాసులు, ఎస్.తిరుపాలయ్య, రామ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సమాంతర మీడియం కొనసాగించాలి



సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

మదనపల్లె సిటీ : పిల్లలకు స్వేచ్ఛనిచ్చి ఇష్టం వచ్చిన మీడియంను ఎంచుకునే విధంగా పాఠశాలల్లో తెలుగు మీడియంను ఇంగ్లీషు మీడియంకు సమాంతరంగా పునః ప్రారంభించడం లేదా కొనసాగించడం చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో యూనియన్ నాయకులతో సమావేశం నిర్వహించారు. ప్రతి ప్రాథమిక పాఠశాలకు విద్యార్థుల సంఖ్యతో నిమిత్తం లేకుండా ఇద్దరు ఉపాధ్యాయులను కేటాయించాలన్నారు. ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 45 దాటితే రెండవ సెక్షన్‌కు అనుమతించాలన్నారు. ఈనెల 21వతేదీన పాత జిల్లా కేంద్రంలో జరగబోయే డీఈఓ కార్యాలయ ముట్టడి కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శులు పురం రమణ, ఆదినారాయణ, నాయకులు విజయకుమార్, సుధాకర్, రవిప్రకాష్, మురళి, అజంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

నోటీసులు ఇవ్వకుండా తొలగించడం అన్యాయం

- వైఎస్సార్ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఒక్కొక్కరికి రూ.2లక్షల మేర నష్టం
- వ్యాపారులకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుంది
- రాష్ట్రమంతా ఒక రకమైన పాలన.. కడపలో మరో రకమైన పాలన
- మేయర్ సురేష్ బాబు మండిపాటు



వైఎస్సార్ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద కూల్చిన కట్టడాలను పరిశీలిస్తున్న మేయర్ సురేష్ బాబు

కడప కార్పొరేషన్ : కడప నగరం మద్రాసు రోడ్డులోని డాక్టర్ వైఎస్సార్ షాపింగ్ కాంప్లెక్స్‌లో లీజుకు ఉన్న వ్యాపారులకు ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా షాపులు తొలగించడం అన్యాయమని మేయర్ సురేష్ బాబు అన్నారు. ఆదివారం ఉదయం ఆయన కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి నగరపాలక అధికారులు తొలగించిన షాపులను పరిశీలించి, వ్యాపారులతో మాట్లాడారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులపై చేస్తున్న దౌర్జన్యాలు, అక్రమాలు, హత్యలకు అడ్డూ అదుపూ లేకుండా పోయిందన్నారు. మహిళలని చూడకుండా అనంతపురం, వైజాగ్, గుంటూరు ప్రాంతాల్లో దాడులకు తెగబడ్డారని, హత్యలు చేశారని గుర్తు చేశారు. ప్రజాస్వామ్యానికి పాతరేసి రెడ్‌బుక్ పాలన పాలన సాగిస్తున్నారని, 29 రాష్ట్రాల్లో ఎక్కడా ఇలాంటి అరాచక పాలన లేదన్నారు. రాష్ట్రమంతా ఒక ఎత్తు అయితే కడపలో మరొక ఎత్తుగా ఉందన్నారు. ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా వారి గొంతునొక్కే విధంగా కక్ష సాధిస్తున్నారన్నారు. నగర ప్రథమ పౌరుడినైన తన ఇంటిపైనే చెత్త వేయించారని, ప్రశ్నించే వారు ఉండకూడదని వారి నోరు నొక్కేలా ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. వైఎస్సార్ షాపింగ్ కాంప్లెక్స్‌లో 10 గదులు ఉన్నాయని, 2007లో వీరంతా బహిరంగ వేలంలో రూ.7.50 లక్షలు చెల్లించి లీజుకు తీసుకున్నారన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ వ్యాపారం జరిగినా, జరక్కపోయినా, కోవిడ్ సమయంలోనూ బాడుగ చెల్లిస్తూ ఉన్నారన్నారు. వీటిలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి జయచంద్రారెడ్డికి కూడా ఒక గది ఉందని, ఆయన్ను లక్ష్యంగా చేసుకొని అందరి షాపులు ధ్వంసం చేయడం దారుణమన్నారు. గదుల పక్కనే కార్పొరేషన్ నిర్మించిన పబ్లిక్ టాయ్‌లెట్లు, ఉర్దూ పాఠశాల ప్రహరీ వీటికంటే ముందుకు ఉన్నాయని మీడియాకు చూపారు. వ్యాపారులు ట్రేడ్‌లైసెన్స్, అడ్వర్‌టైజ్‌మెంట్ ట్యాక్స్, ఎన్‌క్రోచ్‌మెంట్ ట్యాక్స్ చెల్లిస్తున్నప్పటికీ ఆక్రమణల పేరిట తొలగించడం అన్యాయమన్నారు. కడపలో ముడుపులు చెల్లించలేదని వెంచర్లను నిషేధించారని, గతంలో ఏడాదికి 3వేలకు పైగా ప్లాన్ అప్రూవల్స్ అయ్యేవని, కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ప్రతి దానికి కప్పం కట్టాల్సి రావడం వల్లే ఈ ఏడాది 500 అప్రూవల్స్ కూడా కాలేదన్నారు. నగరపాలక అధికారుల వల్ల నష్టపోయిన వ్యాపారులకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని, వారికి నష్ట పరిహారం ఇప్పించడానికి న్యాయ పోరాటం చేస్తామన్నారు.

నాపై ఉన్న కక్షతో ఇతరుల జీవనోపాధి దెబ్బతీయడం దారుణం– జయచంద్రారెడ్డి

తనపై కక్ష ఉంటే నా గదులు మాత్రమే తొలగించాలిగానీ, పక్కనున్నవారి షాపులు కూడా తొలగించి వారి జీవనోపాధి దెబ్బతీయడం దారుణమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పి. జయచంద్రారెడ్డి అన్నారు. షాపింగ్ కాంప్లెక్స్ వద్ద 60 అడుగుల రోడ్డు ఉంది, నాగులపుట్ట, విద్యుత్ స్తంభాలు, పబ్లిక్ టాయ్‌లెట్లు, పాఠశాల ప్రహరీ కంటే లోపలే షాపులు ఉన్నాయన్నారు. ఎమ్మెల్యేపై విమర్శలు చేసే వారి గొంతు నొక్కాలనే ఇలా చేశారన్నారు. సాయంత్ర వేళ అంగళ్లన్నీ మూసిన తర్వాత కూల్చివేయడం అన్యాయమన్నారు. సూర్యనారాయణ వల్లే తాను కొంతకాలం పార్టీకి దూరంగా ఉన్నానే తప్పా, వారిలాగా వేరే పార్టీ కండువా కప్పుకోలేదన్నారు. ఆడిటోరియం బయట, నెహ్రూపార్కు బయట ఉన్న షాపుల వద్ద సూర్యనారాయణరావు డబ్బులు వసూలు చేశాడన్నది అక్షర సత్యమన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పులి సునీల్, యానాదయ్య, శ్రీరంజన్‌రెడ్డి, బీహెచ్ ఇలియాస్, ఐస్‌క్రీం రవి, త్యాగరాజు, దేవిరెడ్డి ఆదిత్య, సింధు, దాసరి శివ, షఫీ, రామ్మోహన్‌రెడ్డి, బసవరాజు, సుబ్బరాయుడు, శివకోటిరెడ్డి, రామలక్ష్మణ్‌రెడ్డి, కె. బాబు, చెన్నయ్య, రెడ్డి ప్రసాద్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

ఉన్నట్టుండి తొలగించడం సమంజసం కాదు



మేము షాపులు మూసేసి ఇంటికి పోతున్న సమయంలో ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా షాపు ముందు ఉన్న రేకులు, ర్యాంపులు, బోర్డులు తొలగించారు. ఎందుకు తొలగిస్తున్నారని అడిగితే సమాధానం చెప్పేవారు కూడా ఎవరూ లేరు. సామాన్లన్నీ పగిలిపోయాయి. చాలా నష్టం జరిగింది.

– వేణుగోపాల్, స్థానిక వ్యాపారి

ఇష్టం వచ్చినట్లు జేసీబీతో లాగేశారు



షాపుల ముందు ఉన్న రేకులు, లైట్లు, బోర్డులు జేసీబీతో ఇష్టం వచ్చినట్లు లాగేశారు. లైట్లు, బోర్డులు పగిలిపోయాయి. వీటికి మేము అడ్వర్‌టైజ్‌మెంట్ ట్యాక్స్ చెల్లిస్తున్నాం. షాపుల ముందు ఏర్పాటు చేసుకున్న తాపలు, ర్యాంపులు తొలగించారు. ఒక్కొక్కరికి రూ.2లక్షల వరకూ నష్టం వచ్చింది. మేమే తొలగించుకుంటామని చెప్పినా వినిపించుకోలేదు.

– రమణ, వ్యాపారి

తమ్ముడి చావుకి కారణమయ్యారని..

నిమ్మనపల్లె : తమ్ముడి చావుకు కారణమయ్యారని కక్ష పెంచుకొని అన్నా వదినలపై కోడి కత్తులతో విచక్షణారహితంగా దాడిచేసి హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన నిమ్మనపల్లె మండలంలో జరిగింది. ఎస్ఐ తిప్పేస్వామి ఆదివారం విలేకరులకు వివరాలు వెల్లడించారు.

చిత్తూరు జిల్లా చౌడేపల్లి మండలం దిగువపల్లె పంచాయతీ యానాది పాలెంకు చెందిన ఎర్రప్ప (30), శ్యామల అలియాస్ చిన్న బుజ్జి (24) దంపతులు. వీరు కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఎర్రప్పకు హనుమంతు, అక్కులప్ప ఇద్దరు తమ్ముళ్లు ఉన్నారు. ఏడాది క్రితం చిన్న తమ్ముడైన అక్కులప్ప వదిన శ్యామలతో వివాహేతర సంబంధం కలిగి ఉండడంతో, విషయం తెలుసుకున్న ఎర్రప్ప నిలదీశాడు. దీంతో మనస్తాపానికి గురైన అక్కులప్ప ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటినుంచి మరో తమ్ముడైన హనుమంతు అన్నా వదినల కారణంగానే తన తమ్ముడు అక్కులప్ప మృతి చెందాడని భావించి వ్యక్తిగతంగా వారిపై కక్ష పెంచుకున్నాడు. వారిని చంపడానికి అవకాశం కోసం ఎదురు చూశాడు. ఈ క్రమంలో ఎర్రప్ప, శ్యామల నిమ్మనపల్లి మండలం బండ్లపై పంచాయతీ దుర్గంవారిపల్లె వద్ద పొలం పనులు చేసుకుంటూ, అక్కడే ఉంటున్నారన్న విషయం తెలుసుకున్నాడు. యానాదిపాలెంకు చెందిన స్నేహితుడు అశోక్ (22), కర్ణాటక వాసి ప్రస్తుతం యానాది పాలెంలో ఉంటున్న శివానంద్ అడివప్ప (24) సాయం కోరాడు. ఈనెల 16న శుక్రవారం సాయంత్రం ముగ్గురు కలిసి పథకం ప్రకారం కోడి కత్తులు తీసుకొని ద్విచక్ర వాహనంలో వచ్చి దుర్గంవారిపల్లె సమీపంలోని గుంటి వద్ద కాపు కాశారు. భార్య శ్యామలతో కలసి ఎర్రప్ప దుర్గం వారికి పల్లెకు వెళుతుండగా అడ్డుకున్నారు. తమ వెంట తెచ్చుకున్న కోడి కత్తులతో హనుమంతు, అశోక్, శివానంద్ వారిపై దాడి చేసి విచక్షణారహితంగా పొడిచి హత్యాయత్నానికి పాల్పడ్డారు. దాడిలో తీవ్రంగా గాయపడిన బాధితులను స్థానికులు మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. శ్యామల తండ్రి పాపన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం నిందితులను ఆదివారం మండలంలోని పిట్టవాండ్లపల్లె క్రాస్ వద్ద అరెస్టు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. రిమాండ్ నిమిత్తం నిందితులను కోర్టుకు హాజరు పరిచినట్లు తెలిపారు.